ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

శివశక్తి అనుగ్రహ మహాపీఠంలో శివ లింగానికి అభిషేకం చేస్తున్న మంత్రి సురేఖ

భువనగిరి కలెక్టరేట్ : శివశక్తి అనుగ్రహ మహాపీఠంలో బంగారు శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్, మార్చి 8 : జిల్లాలో మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణతో మార్మోగాయి. భువనగిరిలోని పచ్చలకట్ట సోమేశ్వరాలయం, బహార్‌పేట్‌లోని దక్షిణేశ్వరాలయం, ఓంకారాశ్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో శివపార్వతులను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయాల్లో శివపార్వతుల కల్యాణోత్సవం కనులపండువగా జరిపించారు.

భువనగిరి కలెక్టరేట్ : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో శివశక్తి అనుగ్రహ మహాపీఠం రమణేశ్వరంలో సిద్ధగురు రమణానంద మహర్షి ఆధ్వర్యంలో శివలింగాలు, ప్రతిష్ఠ దేవతామూర్తులకు అభిషేకాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలోని బంగారు శివలింగానికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అభిషేకం, పూజలు చేశారు.

యాదగిరిగుట్ట : కొండపైన అనుబంధ శివాలయంలో ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు సాయంత్రం పరమశివుడిని దర్శించుకుని అభిషేకం, అష్టోత్తర పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ తిరువీధుల్లో ఉపవాస దీక్ష విరమించారు. మండలంలోని సైదాపురం గ్రామంలో వీరభద్రస్వామి ఆలయంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దంపతులు పూజలు చేశారు.

చౌటుప్పల్ : మున్సిపాలిటీ వ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి, రహీంఖాన్‌పేటలోని మహాలింగేశ్వరస్వామి, కూరెళ్లలోని సోమేశ్వరస్వామి, కప్రాయపల్లిలోని శివాంజనేయస్వామి, మొరిపిరాలలోని శివమహాదేవ స్వామి ఆలయాల్లో వేడుకలు నిర్వహించారు.

బొమ్మలరామారం : ఆలయాల్లో శివలింగాలకు పూజలు నిర్వహించారు. శివపార్వతుల కల్యాణాన్ని జరిపించారు.

వైభవంగా పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం

భూదాన్ పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. మండలంలోని మార్కండేశ్వరస్వామి, లక్ష్మీనారాయణ స్వామి, బుగ్గ రామలింగేశ్వరస్వామి, నల్ల వీరభద్రేశ్వరస్వామి, మహమ్మాయిదేవి, కనుముక్కుల వేంకటేశ్వరస్వామి, దేశ్‌ముఖి సాయి బృందావనం దేవాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. శివలింగాలకు పాలాభిషేకం చేశారు. మార్కండేశ్వరస్వామి ఆలయంలో మార్కండేశ్వరస్వామి భజన మండలి ఆధ్వర్యంలో సామూహిక ఉమామహేశ్వరుల వ్రతాలు నిర్వహించారు.

గుండాల : మండల వ్యాప్తంగా భక్తులతో శివాలయాలు సందడిగా మారాయి. రాత్రి జాగారాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలోని ప్రాచీన ఉమామహేశ్వరస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డి పూజలు నిర్వహించారు.

వలిగొండ : మండల కేంద్రంలోని భవానీ శంకరస్వామి, త్రిశక్తి ఆలయం, వలిగొండ గుట్టపై కొలువైన ముక్కంటి శివలింగేశ్వర స్వామి, సంగెంలో భీమలింగేశ్వరస్వామి, ప్రొద్దటూరులోని రామలింగేశ్వరస్వామి, మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి కొండపై పంచముఖ రామలింగేశ్వరస్వామి ఆలయం, ఎం.తుర్కపల్లిలో రాజన్న శివాలయంలో, రెడ్ల రేపాకలో భవానీ శంకరస్వామి, సుంకిశాల శివాలయంలో, కంచనపల్లి కాశీవిశ్వేశ్వర స్వామి శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. శివాలయాల్లో స్వామివారి కల్యాణం ఘనంగా జరిపించారు.

మోత్కూరు : మండలంలోని పాలడుగు, ముశిపట్ల, దాచారం, సదర్శాపురం, దత్తప్పగూడెం, పొడిచేడు, బుజిలాపురంలోని ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. మున్సిపాలిటీ కేంద్రంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత పూజల్లో పాల్గొన్నారు.

కనుల పండువగా ఉమామహేశ్వరస్వామి కల్యాణం



బీబీనగర్ : మహదేవ్‌పూర్‌లో ఉమామహేశ్వరస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, భక్తులు

బీబీనగర్, మార్చి 8 : మహా శివరాత్రిని భక్తులు భక్తి శ్రద్ధతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహదేవ్‌పూర్ గ్రామంలో అక్కన్న, మాదన్న దేవాలయంలో ఉమామహేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ ఈఓ రామకృష్ణారావు, ప్రధానార్చకుడు నల్లన్‌థీఘుళ్ లక్ష్మీనరసింహాచార్యులు

ప్రభుత్వ విప్ అయిలయ్యకు బ్రహ్మోత్సవ ఆహ్వానం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణంలోని ఆయన నివాసంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 11న బ్రహ్మోత్సవాలను ప్రారంభించి 17న స్వామివారి ఎదుర్కోలు మహోత్సవం, 18న తిరు కల్యాణం, 19న దివ్య విమాన రోథత్సవం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ డీఈఓ దోర్బల భాస్కర్ శర్మ, ప్రధానార్చకులు నల్లన్‌థీఘుళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, ఏఈఓ రఘు పాల్గొన్నారు.

నిదానపల్లిలో మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు

ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రామన్నపేట, మార్చి 8 : మండలంలోని నిదానపల్లి గ్రామ పరిధిలోని మల్లన్నగుట్టపై వెలిసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి (చిన్న శ్రీశైలం) బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి యంత్ర స్థాపన, మహానంది ప్రతిష్ఠ, దృష్టి కుంభం, అష్టదిక్పాల బలిహరణ కార్యక్రమం నిర్వహించారు. గణపతి పూజ, స్వస్తివాచనం, ధ్వజారోహణం, రుద్రాభిషేకం తదితర కార్యక్రమాలు చేపట్టారు.

'చట్ట సభల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలి'

బీబీనగర్‌లో పాదయాత్రకు స్వాగతం పలికిన బీసీ సంఘం నాయకులు

బీబీనగర్, మార్చి 8 : చట్ట సభల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని బీసీ సంఘం నాయకుడు పుటం పురుషోత్తంరావు అన్నారు. చట్టసభల్లో బీసీలకు తగిన వాటా కల్పించాలని డిమాండ్ చేస్తూ మీర్‌గానిపల్లి నుంచి సర్దార్ పాపన్న ఖిలాషాపూర్ వరకు 364 కిలోమీటర్లు చేపట్టిన మహా పాదయాత్ర శుక్రవారం మండలంలోని కొండమడుగు గ్రామానికి చేరుకున్నది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట సభల్లో తమ వాటా సాధించాలంటే బీసీలంతా సంఘటితంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు సిద్ధేశ్వర్, నరేందర్‌గౌడ్, సతీశ్, అరుణ, వనజ, విమల పాల్గొన్నారు.

పోలీసుల చెంతకు గుర్తు తెలియని బాలుడు

పోలీసులకు దొరికిన బాలుడు

బీబీనగర్, మార్చి 8 : తల్లిదండ్రుల నుంచి తప్పిపోయిన బాలుడిని గురువారం పోలీసులు గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని పడమటిసోమారం గ్రామంలో ఓ గుర్తు తెలియని బాలుడు తప్పిపోయి తిరుగుతుండడాన్ని పెట్రోలింగ్ పోలీసులు గుర్తించి పోలీస్టేషన్‌కు తరలించారు. శుక్రవారం వరకు బాలుడి గురించి సమాచారం అందకపోవడంతో అతడిని జిల్లా బాలల పరిరక్షణ అధికారులకు అప్పగించారు. తాత్కాలికంగా బాలుడి రక్షణ కోసం అధికారులు చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆశ్రయం కల్పించారు. బాలుడికి మాటలు సరిగా రావడం లేదని, తన వివరాలను వెల్లడించలేకపోతున్నాడని పోలీసులు తెలిపారు. బాలుడి వివరాలు తెలిసిన వారు జిల్లా బాలల పరిరక్షణ విభాగంలో సంప్రదించాలని సూచించారు.

ఆర్థిక సాయం

బాలయ్య కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న బ్యాంకు సిబ్బంది

భువనగిరి కలెక్టరేట్, మార్చి 8 : అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని గౌస్‌నగర్ గ్రామానికి చెందిన నల్లమాసు బాలయ్య (65) కుటుంబ సభ్యులకు చందుపట్ల పీఏసీఎస్ సభ్యుల డివిడెండ్ నిధి నుంచి శుక్రవారం రూ.30వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ ఐలయ్య సహకారంతో మంచినీటి బోరు ఏర్పాటు

ఆత్మకూరు(ఎం), మార్చి 8 : మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద మంచినీటి కోసం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో శుక్రవారం బోరు వేయించారు. నీటి సమస్య రాకుండా ఉండేందుకు డబుల్ బెడ్రూం ఇండ్లల్లో నివసిస్తున్న వారి కోసం బోరు వేసినట్లు మాజీ సర్పంచులు జెన్నాయి కోడె నగేశ్, యాస లక్ష్మారెడ్డి తెలిపారు. వారి వెంట నాయకులు పోతగాని మల్లేశం, కోరె మల్లేశం, సురేశ్ ఉన్నారు.

ఆలేరు రూరల్ : కొలనుపాక సోమేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

చౌటుప్పల్ : సీతారామచంద్ర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బొమ్మలరామారం : గుడిబావి రామలింగేశ్వర ఆలయం వద్ద యాగం చేస్తున్న భక్తులు

గుండాలలో కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయంలో..

భూదాన్ పోచంపల్లిలో ఉమామహేశ్వరుల సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

భూదాన్ పోచంపల్లిలో శివలింగానికి పాలాభిషేకం చేస్తున్న భక్తులు

ఆత్మకూరు(ఎం) : శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వలిగొండ : ప్రొద్దటూరు రామలింగేశ్వర స్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్ : మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, మార్చి 8 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పిలుపుతో నియోజకవర్గంలో బెల్టు దుకాణాలు మూతపడ్డాయన్నారు. ఇదంతా మహిళల విజయమేనని పేర్కొన్నారు. అంతకు ముందు మహిళలతో కలిసి మద్యం బెల్టు షాపుల దిష్టిబొమ్మను దహనం చేశారు. బెల్టు షాపులను నివారిస్తామని మహిళలు నినాదాలు చేశారు. ప్ల కార్డులు ధరించి ప్రతిజ్ఞ కూడా చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్, జిల్లా ఉప వైద్యాధికారి యశోద, కౌన్సిలర్లు కాసర్ల మంజుల, కామిశెట్టి శైలజ, సందగళ్ల విజయ, బత్తుల రాజ్యలక్ష్మి, కొయ్యడ సైదులు గౌడ్, పోలోజు శ్రీధర్ బాబు, ట్రీనిటి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఉజ్జిని మంజుల పాల్గొన్నారు.

మహిళా ప్రజాప్రతినిధులకు సన్మానం

భువనగిరి కలెక్టరేట్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని బీఎన్ తిమ్మాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మహిళా ప్రజాప్రతినిధులను సన్మానించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహిళల పట్ల గౌరవ భావాన్ని అలవర్చుకొని ప్రతి మహిళలో తల్లిని, చెల్లిని చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉడత శారద, మాజీ ఉప సర్పంచ్ ఎడ్ల దర్శన్‌రెడ్డి, పాల సంఘం చైర్మన్ గజ్జి గోపాల్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : మండలంలోని కనుముక్కుల గ్రామంలో పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మహిళలను జడ్పీటీసీ కోట పుష్పలత సత్కరించారు. భూదాన్ పోచంపల్లిలో మహిళా కార్మికులు, నాయకులను మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు నోముల మమత సన్మానించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

కార్యక్రమాల్లో నాయకులు కోట మల్లారెడ్డి, పాక నరసింహ, చిలకమర్రి వంశీచార్యులు, పాక మల్లేశ్‌యాదవ్, మెరుగు శశికళ, బస్వా రెడ్డి, నిర్మల, కృష్ణవేణి, ఇందిరమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

రాజాపేట : స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేక్ కట్ చేసి మహిళా పోలీసులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, ఏఎస్ఐ చంద్రయ్య, హెడ్ కానిస్టేబుల్ యాదయ్య, పోలీస్ సిబ్బంది రాజు, మారుతి పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలు అందించిన మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కానుగంటి శ్రీశైలం, మహిళలు శిరీష. శ్యామల, మాధవి, మంజుల, లక్ష్మి పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : కనుముక్కుల గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మహిళలను సన్మానిస్తున్న జడ్పీటీసీ కోట పుష్పలత

రాజాపేట : మహిళా పోలీసులను సన్మానిస్తున్న ఎస్ఐ సుధాకర్‌రెడ్డి

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- 12తులాల బంగారు ఆభరణాలు, 20వేల నగదు అపహరణ

మోత్కూరు, మార్చి 8 : మున్సిపాలిటీ కేంద్రంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితుల వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన బట్టు లింగయ్య, ఆండాలు దంపతులు శుక్రవారం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనుల కోసం తమ బావి వద్దకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూసి చోరీ జరిగినట్లు గుర్తించారు. 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదును దోచుకెళ్లారని బాధితులు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎస్ఎస్‌బీకి గురుకుల విద్యార్థినుల ఎంపిక

బీబీనగర్, మార్చి 8 : మండలంలోని రాఘవాపురం గ్రామంలో గల గురుకుల సైనిక శిక్షణ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ 2024లో ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఆఫ్ కాట్ పరీక్షలో ఏడుగురు విద్యార్థినులు మంచి మార్కులు సాధించి సర్వీస్ సెలెక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ)కి ఎంపిక య్యారని పేర్కొన్నారు. సంస్థ కార్యదర్శి సీతాలక్ష్మి హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థినులను, డైరెక్టర్ రాఖీ చౌహాన్‌ను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించినట్లు తెలిపారు.